
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY



ఊరూరా.. పెళ్లికాని ప్రసాదులు..



- పేరయ్యల వద్దకు పరుగులు
- పెద్ద మొత్తంలో ముట్టజెబుతున్న వైనం
- పెళ్లి కూతురి కోసం ఇతర రాష్ట్రాల బాట
- వధువుకు డబ్బు ఇచ్చి ఒప్పిస్తున్న దుస్థితి



30 ఏళ్లు దాటినా వివాహం కాక తిప్పలు

కొత్తచెరువు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కుమారుడికి పెళ్లి చేయడం తల్లిదండ్రులకు పెను సమస్యగా మారుతోంది. పెళ్లి చేయాలంటే నానా తిప్పలు పడుతున్నారు. ఒకప్పుడు పెళ్లిళ్లు ఇరువైపులా పెద్దలు ఈడు-జోడు కుటుంబ స్థాయిలు చూసుకుని, చక్కగా కుదుర్చుకునే వారు. ఈజీగా పిల్లలకు ముడి పెట్టేసేవారు. ఇబ్బందులు పడేవారుకాదు. ఇప్పుడు పెళ్లి అంటే అబ్బాయిల తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. అమ్మాయిల కొరతే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఒకప్పుడు కట్నం డిమాండ్ చేసే అబ్బాయిల తల్లిదండ్రులు ఇప్పుడు.. అమ్మాయినిస్తే అదే పదివేలు అనే పరిస్థితికి వచ్చేశారు. వయసు మీరిపోతుండడంతో పేరయ్యలను ఆశ్రయిస్తున్నారు. పెద్దమొత్తంలో డబ్బు ఇచ్చి, ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెళ్లి కాక బ్రహ్మచారులుగా మిగిలిపోతున్న యువకుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోందని స్వచ్ఛంద సంస్థల గణాంకాల ద్వారా తెలుస్తోంది.

మా వాడికి పిల్లను చూడండి..
పుణ్యం కట్టుకోండి..
బంధువులకు విన్నపాలు..

ఎంతైనా ఇస్తాం..
ఏదో ఒక సంబంధం సెట్ చేయండి..
పేరయ్యలతో బేరాలు..

కట్నం వద్దు.. కానుకలూ వద్దు..
అమ్మాయి నచ్చితే చాలు..
వధువు తల్లిదండ్రులకు హామీలు..

మేమే డబ్బు ఇస్తాం..
పిల్లను ఇవ్వండి ప్లీజ్..
వేడుకోళ్లు..

అమ్మాయికి బంగారం చేయిస్తాం..
పెళ్లి ఖర్చు మాదే..
మీరు వస్తే.. చాలు..

వయసు మీరిపోతున్న కుమారుడికి పెళ్లి చేయడానికి తల్లిదండ్రులు పడుతున్న అవస్థలు ఇవి..

30 ఏళ్లు దాటినా..

గతంలో అబ్బాయిలకు 25, 26 ఏళ్లు వచ్చేసరికి పెళ్లిళ్లు అయిపోయేవి. కొన్నేళ్లుగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎన్నో సంబంధాలు చూస్తున్నా పెళ్లి కావడం లేదు. దీంతో 30 ఏళ్లు దాటినా పెళ్లికాని వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. అబ్బాయిలకు సంబంధాలు దొరకడం కష్టమైపోయింది. ఒకప్పుడు అబ్బాయి గుణగణాలు, కుటుంబం గురించి తెలుసుకుని పిల్లనిచ్చేవారు. ఇప్పుడు 'అబ్బాయి ఏం చదువుకున్నాడు... ఏ ఉద్యోగం చేస్తున్నాడు... ప్రభుత్వ ఉద్యోగమా.. ప్రైవేటా.. ఏ కంపెనీలో చేస్తున్నాడు...' అంటూ అబ్బాయి తల్లిదండ్రులను అమ్మాయి తరఫువారు ప్రశ్నిస్తున్నారు. దీంతో అబ్బాయిలకు పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు యజ్ఞమే చేయాల్సి వస్తోంది.

చిరుద్యోగులు, రైతులకు కష్టమే..

గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మాయిల తల్లిదండ్రులు ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగాలు చేసే అబ్బాయిలను కోరుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లోని అమ్మాయిల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే అబ్బాయిల సంబంధాలకే మొగ్గుచూపుతున్నారు. విదేశాల్లో ఉద్యోగం చేసే అబ్బాయిలకు డిమాండ్ విపరీతంగా ఉంటోంది. చిరుద్యోగం, వ్యవసాయం చేసుకునే అబ్బాయిలకు పెళ్లి కావడం గగనంగా మారుతోంది. 35 ఏళ్లు దాటినా పెళ్లి సంబంధాలు కుదరడం లేదు.

ఎదురుకట్నం ఇచ్చి పెళ్లి.. వారానికే వధువు పరార్..

హిందూపురం ప్రాంతానికి చెందిన ఒక యువకుడికి డబ్బు, వ్యవసాయ భూమి ఉంది. 35 ఏళ్లు దాటినా పెళ్లికాలేదు. దీంతో ఆ యువకుడు పెళ్లిళ్ల పేరయ్యను ఆశ్రయించాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువతికి ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకున్నాడు. వారం తిరక్కుండానే వధువు.. తన తల్లికి జబ్బు చేసిందంటూ ఊరెళ్లింది. తర్వాత తిరిగి రాలేదు. దీంతో ఆ యువకుడు తన భార్య రాలేదంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయినా ప్రయోజనం లేదు.

ఇతర రాష్ట్రాల బాట

ప్రస్తుతం వివాహానికి కులం, గోత్రం చూసేవారు తక్కువైపోయారు. నచ్చితే చాలు పెళ్లి చేసుకుంటామంటూ ముందుకొస్తున్నారు. దీంతో కొందరు పేరయ్యలు ఇదే అదునుగా భావించి, యువకుల వద్ద లక్షల రూపాయలు గుంజుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా, కర్ణాటక, ఏపీలోని మారుమూల ప్రాతాలకు చెందిన అమ్మాయిల పెద్దవారితో ఒప్పందం కుదుర్చుకుని, పెళ్లిళ్లు చేస్తున్నారు. అలా పెళ్లిళ్లు చేసుకున్న వారిలో కొంతమంది ఏదో ఒక సమస్యతో చెప్పకుండానే సొంత ఊర్లకు వెళ్లిపోతున్నారు. ఈ వివాదాలు పోలీసు స్టేషన్లకు చేరుతున్నాయి.

తల్లిదండ్రుల పట్టుదలే శాపమా...?

కొంతమంది అబ్బాయిల తల్లిదండ్రుల పట్టుదలే వారి పెళ్లికి శాపాలుగా మారుతున్నాయని చెప్పవచ్చు. ఎక్కువగా కట్న కానుకలు ఆశించడం, అమ్మాయిలు అనకువగా, అందంగా ఉండాలని కోరుకుంటూ మొదటలో వచ్చిన సంబంధాల వదులుకుం టున్నారు. ఈ పట్టుదలలతో అబ్బాయిలకు వయసు దాటిపోతున్నా పెళ్లి కావట్లేదు. దీంతో యువకులతో పాటు, వారి తల్లిదండ్రులు మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారు. ఏళ్లు దాటినా పెళ్లి కావడంలేదని అబ్బాయిలు మానసిక ఒత్తిడితో కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

పెళ్లిళ్ల పేరయ్యకు డిమాండ్ : వెంకటరాముడు, పుట్టపర్తి

ప్రస్తుతం ఆస్తులు, భూములు ఉన్నా.. అమ్మాయిలను ఇవ్వడం గగనంగా మారింది. తమ కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం చేసే అబ్బాయే కావాలని తల్లిదండ్రులు అడుగుతున్నారు. దీంతో చిరు ఉద్యోగులు, వ్యవసాయం చేసే యువకులకు అమ్మాయిని ఇవ్వాలంటే ప్రతిఒక్కరూ ఆలోచిస్తున్నారు. దీంతో వయసు పైబడుతున్నా పెళ్లికాని యువకులు తమకు సంబంధాలు చూడాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. అలా.. పెళ్లిళ్ల పేరయ్యలకు డిమాండ్ పెరిగింది.



అర్జీలను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్



విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలిచ్చే అర్జీలను సంబంధిత అధికారులు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 266 అర్జీలు వచ్చాయి. వాటిని కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీదారుల సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారించి, వారు సంతృప్తి చెందేలా గడువులోపు సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల సహాయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉన్నత విద్య చదువుతున్న 8 మంది విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

డీపీఓలో..



ఫిర్యాదిదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్(ఆంధ్రజ్యోతి): చట్ట పరిధిలో ప్రజాఫిర్యాదులను సత్వరమే విచారించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో సోమవారం నిర్వహించిన ప్రజా వేదికలో 60 ఫిర్యాదులు అందాయి. వాటిని స్వీకరించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఖాశీం స్వామి మూడురోజుల సరిగెత్తు

బత్తలపల్లిలో శనివారం ఖాశీం సామి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. సోమవారం మూడురోజుల సరిగెత్తు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, చక్కెర చదివింపులు చేయించుకున్నరు.

-ఆంధ్రజ్యోతి, బత్తలపల్లి



అలంకారంలో ఖాశీం స్వామి

ఇంకొక్కరు..!



వాహనంలో కూతురికి జన్మనిచ్చిన శ్రీమహాలక్ష్మి

మడకశిర మండల హెచ్‌ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన గర్భిణి శ్రీమహాలక్ష్మి 108 వాహనంలో ప్రసవించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ మంజుల తెలిపారు. శ్రీమహాలక్ష్మికి ఆదివారం రాత్రి పురిటి నొప్పులు వచ్చినట్లు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో పావగడకు తీసుకువెళుతుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌ను రోడ్డు పక్కన ఆపి ప్రసవం చేశామని మంజుల తెలిపారు. ఈ నెల 22న, ఆదివారం రాత్రి సోమందేపల్లి మండలం పందిపర్తి గ్రామానికి చెందిన మంజుల ఆటోలో ప్రసవించారు. ఆ ఘటనపై 'అమ్మా.. జాగ్రత్త' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇంకో ఆదివారం రాత్రి వచ్చిందో లేదో.. శ్రీమహాలక్ష్మి 108లో ప్రసవించారు. గర్భిణుల పట్ల ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రసవానికి కాస్త ముందు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్చేలా చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

-ఆంధ్రజ్యోతి, మడకశిర రూరల్

పారదర్శకతకు పాతర..!

- అంగట్లో సరుకులా బదిలీలు
- ప్రభుత్వానికి కావాల్సినంత చెడ్డపేరు
- కలెక్టర్ సారూ.. ఉన్నారా..? అసలున్నారా..?



అనంతపురం నెట్‌వర్క్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): 'పరిపాలన పారదర్శకంగా ఉండాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండాలి..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే అధికారులకు చెబుతుంటారు. కానీ జిల్లాలో కొందరు ఉన్నతాధికారులకు సీఎం మాటలు ఎక్కినట్లు లేవు. ఏకపక్ష ధోరణి, అవినీతి, ఆశ్రితపక్షపాతంలో నిబంధనలకు తూట్లు పొడుతున్నారు. పారదర్శకతకు పాతరేస్తున్నారు. అందుకు ఉదాహరణ.. సచివాలయ ఉద్యోగుల బదిలీలు. మెరిట్, స్పౌజ్.. ఇవేవీ బదిలీలకు ప్రాతిపదిక కాలేదు. తెరవెనుక ఏం జరిగిందో తెలియదు..! చాలా స్థానాలను బ్లాక్ చేశారు. మెరిట్ జాబితాలో కనీసం తొలి ఐదుగురికి కూడా కోరుకున్న స్థానాలను చూపలేదంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వెల్ఫేర్, పోలీసు, ఆర్‌ఎస్‌కే.. ఇలా ఏదీ పద్ధతిగా సాగలేదు. వెల్ఫేర్‌లో మరీ దారుణంగా వ్యవహరించారు. 'ఆ నియోజకవర్గంలో అడగొద్దు..' అని మైక్ పట్టుకుని

(మిగతా 6లో..)

గుడే బడి

వైటీరెడ్డిపల్లిలో ఐదేళ్లుగా విద్యార్థులకు గుడిలోనే పాఠాలు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



వైటీ రెడ్డిపల్లిలో గుడిలోనే పాఠాలు నేర్పుతున్న ఉపాధ్యాయుడు



పాడుబడిన పాఠశాల

సాధారణంగా బడి గుడిలాంటిది అని అంటారు. అయితే వైటీరెడ్డిపల్లి గ్రామంలో మాత్రం గుడే బడిగా మారింది. గ్రామంలో ఉన్న పాఠశాల శిథిలావస్థకు చేరడమే ఇందుకు ప్రధాన కారణం. గడచిన ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయులు దేవాలయంలోనే పాఠాలు బోధిస్తున్నారు. ఈ గ్రామం మండలకేంద్రానికి 20కి.మీల దూరంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉంది. గ్రామంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 26 మంది ఉన్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు. పాఠశాల శిథిలావస్థకు చేరడంతో గ్రామంలోని బ్రహ్మంగారి గుడిలో పిల్లలకు పాఠాలు చెప్పడం ప్రారంభించారు. గత ప్రభుత్వంలో పాఠశాల సమస్యను గ్రామస్థులు ఎన్నోసార్లు అప్పటి మంత్రి శంకరనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేదు. అప్పటి ప్రభుత్వం నాడు-నేడు పేరుతో అనేక స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించినప్పటికీ వైటిరెడ్డిపల్లి పాఠశాలను విస్మరించింది. దీంతో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

- ఈ విషయంపై ఎంఈఓ జయభాస్కర్‌ను వివరణ కోరగా పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రత్యామ్నాయం లేక గుడిలోనే పాఠాలు చెప్పిస్తున్నామన్నారు. పాఠశాలకు నూతన భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

14 ఏళ్ల సమస్య పరిష్కారం

దివ్యాంగురాలికి ఇంటి స్థలం అప్పగింత



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న బాధితురాలు

పెనుకొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లిలో 14 ఏళ్లుగా ఉన్న సమస్యను సోమవారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పరిష్కరించి, దివ్యాంగురాలికి న్యాయం చేశారు. సోమందేపల్లికి చెందిన దివ్యాంగ చేనేత కార్మికురాలు లక్ష్మీదేవికి సప్తగిరి కాలనీలో 2010లో ఇంటి పట్టా మంజూరు చేశారు. ఆ స్థలాన్ని మరొకరు ఆక్రమించుకోవడంతో న్యాయం చేయాలని 14 ఏళ్లుగా కార్యాలయం చుట్టూ లక్ష్మీదేవి తిరుగుతోంది. సోమవారం ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆమె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందించి, పరిస్థితిని వివరించి బోరున విలపించింది. స్పందించిన ఆర్డీఓ.. ఇంటి స్థలాన్ని లక్ష్మీదేవికి అప్పగించాలని సోమందేపల్లి డీటీ రెడ్డిశేఖర్, వీఆర్వో నాగరాజు, హౌసింగ్ ఏఈని ఆదేశించారు. వెంటనే అధికారులు విచారణ చేపట్టి, ఆమెకు పట్టా స్థలాన్ని చూపించారు. దీంతో లక్ష్మీదేవి హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమేష్, చేనేత కార్మిక సంఘం నాయకులు చీల నారాయణస్వామి, బాబ్జాన్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్, ఎకనామిక్స్ అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహమ్మద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 50శాతం పైగా మార్కులు ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు జూలై 4లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

కోరింది కావాలంటే ఎట్లా..?

- మహిళా పోలీసుల బదిలీల్లో వివాదం
- స్పౌజ్ వైపు వెళ్లకుండా నచ్చినచోట కొందరి ఆప్షన్
- అభ్యంతరం తెలిపిన మిగిలిన ఉద్యోగులు
- సచివాలయ మహిళా పోలీసుల బదిలీలు ప్రారంభం
- సిఫార్సు లేఖలతో పారదర్శకతపై అనుమానాలు

అనంతపురం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసుల బదిలీల్లో స్పౌజ్ వివాదం తలెత్తింది. దీంతో కొంత సేపు గందరగోళం, సందిగ్ధం నెలకొంది. బదిలీల కౌన్సెలింగ్‌లో కొందరు మహిళా పోలీస్‌లు తమ స్పౌజ్ ఉన్న ప్రాంతం వైపు కాకుండా అనంతపురంలోనే ఆప్షన్ ఇవ్వడంతో మిగిలిన వారు అభ్యంతరం తెలిపారు. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు ఆప్షన్లు ఇచ్చిన వాళ్లను మళ్లీ వెనక్కు పిలిచారు. దీంతో కొంత గందరగోళం నెలకొంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీస్‌లకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 8 గంటల నుంచే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే 12 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన వందలాది మంది మహిళా పోలీసులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. సుమారు గంట సేపు కౌన్సెలింగ్ సాజావుగా సాగింది. అయితే హఠాత్తుగా కొందరు స్పౌజ్‌ను దుర్వినియోగం చేశారంటూ అభ్యంతరం తెలిపారు.

స్పౌజ్ వైపు కాకుండా..

కొందరు దరఖాస్తుదారులు తమ భర్త లేదా భార్య(స్పౌజ్) ఉన్న పట్టణం లేదా, దాని సమీప ప్రాంతాలు కాకుండా తమకు నచ్చిన పట్టణాల్లో కోరుకున్నారు. ఒక అభ్యర్థి భర్త హిందూపురంలో ఉంటే....ఆమె అనంతపురానికి ఆప్షన్ ఇచ్చారు. మరో అభ్యర్థి భర్త నార్పలలో ఉంటే ఆమె అనంతపురంలోని సచివాలయానికి ఆప్షన్ ఇచ్చారంటూ అభ్యర్థులు ఆందోళన చేశారు. ఇలా సుమారు నలుగురు ఆప్షన్లు ఇచ్చారంటూ కొందరు మహిళా పోలీసులు అభ్యంతరాలు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్పీ జగదీష్, డీఎస్పీలు ఆ అభ్యర్థులను వెనక్కు రప్పించి స్పౌజ్ సమస్యపై విచారించారు. తర్వాత కౌన్సెలింగ్‌ను సజావుగా కొనసాగించారు. బయట ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు వద్దకు రూరల్ సీఐ శేఖర్, మరికొందరు పోలీసులు వచ్చి బదిలీలు పారదర్శకంగానే జరుగుతున్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దంటూ సముదాయించారు.

ఖాళీలు డిస్‌ప్లే చేయలేదని ఆవేదన..

కౌన్సెలింగ్‌కు ముందు ఖాళీల జాబితా ప్రకటించకపోవడంపై చాలామంది మహిళా పోలీస్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ హాల్‌లోకి వెళ్లే వరకూ ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో తెలియని అయోమయ పరిస్థితి ఉందని వాపోయారు. లోపల కౌన్సెలింగ్‌కు వెళ్లిన వాళ్లు ఏ ప్లేస్‌కు ఆప్షన్ ఇచ్చారు..? ఏ ప్లేస్‌లు మిగిలాయో..? తాము ఎక్కడికి ఆప్షన్ ఇవ్వాలో అంటూ హైరానా పడ్డారు. కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు తీసుకున్న తర్వాత మిగిలే ఖాళీలు(లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలు) చూసేలా బయట డిస్‌ప్లే బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అభ్యర్థులు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో 3, 4 సిఫార్సు లేఖలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో బదిలీల పారదర్శకతపై అనేక సందేహాలు కలుగుతున్నాయి. కాగా మధ్యాహ్నం మొదలైన కౌన్సెలింగ్ రాత్రి వరకూ కొనసాగింది.


కౌన్సెలింగ్‌లో వేకెన్సీలు చూస్తున్న మహిళా పోలీసులు


కిటకిటలాడుతున్న డీపీఓ ప్రాంగణం


స్పౌజ్ వివాదంపై అభ్యంతరం చెబుతున్న మహిళా పోలీసులు


తల్లులు కౌన్సెలింగ్‌కు హాజరుకావడంతో పిల్లలను నిద్రపుచ్చుతున్న వారి బంధువులు

'నాయకుల' తీరు సందేహాస్పదం

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో యూనియన్ నాయకుల తీరుపై విమర్శలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ విభాగంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో యూనియన్ నాయకులు వ్యవహరించిన తీరు సందేహాస్పదంగా మారింది. నాయకులు బాధితుల పక్షమా..? లేక అధికారుల పక్షమా అన్నది అర్థం కాకుండా పోయింది. సోమవారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఈ జహీర్ అస్లాం ఏక పక్షంగా బదిలీలకు శ్రీకారం చుట్టారన్న ప్రచారం జరుగుతోంది. ఇందులో అనంతపురం ఈఈకి కూడ ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకుండా శ్రీ సత్యసాయి జిల్లా ఈఈ, ఇన్‌చార్జ్ ఎస్ఈ మురళీకృష్ణ ఆధ్వర్యంలో బదిలీలకు శ్రీకారం చుట్టారన్న విమర్శలు ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా ఉన్నవారు యూనియన్ నాయకుల పేరుతో బదిలీల విషయంగా చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. అయితే అధికారులతో సమావేశమై సోమవారం చర్చలు జరపడం వీరి తీరును సందేహింపజేస్తోంది. మీకు కావాల్సినవి మీరు తీసుకోండి. మా విధులకు అడ్డు తగలద్దండి అనే ఒప్పందానికి వచ్చారన్న ప్రచారం జరుగుతోంది. అయితే సోమవారం వరకు ఎస్ఈ జహీర్ అస్లాం బదిలీల ప్రక్రియ అంతా తానై నిర్వహించారు. మంగళవారం నుంచి ఇన్‌చార్జ్ ఎస్ఈగా ఈఈ ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. దీంతో నాయకుల నుంచి వచ్చే ఒత్తిళ్లకు బలికావాల్సి వస్తుందన్న ప్రచారం జరుగుతోంది.

దిద్దుబాట..!

బదిలీల్లో పొరపాట్ల సవరణకు అధికారుల శ్రీకారం

డీపీఓ కార్యాలయానికి క్యూకట్టిన బాధితులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు సంబంధించి గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల్లో జరిగిన తప్పులను సరిదిద్దే చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు. తొలి రోజు శనివారం బదిలీల కోసం అధికారులు చేపట్టిన చర్యలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు ర్యాంకుల వారిగా కౌన్సెలింగ్‌కు శ్రీకారం చుట్టారు. స్పౌజ్, అనారోగ్య కారణాలు ఇతర సమస్యలతో రెక్వెస్ట్ పెట్టుకున్నవారితో అప్పట్లోనే ఆప్షన్ ఫామ్స్ తీసుకొని పంపించేశారు. ఆప్షన్ ఫామ్స్ ఇచ్చిన వాటిని బ్లాక్ చేయమని గుమాస్తాలకు బాధ్యతలు అప్పగించారు. గుమస్తాలు ఇష్టారాజ్యంగా డిమాండ్ ఉన్నవాటినంటిని బ్లాక్ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మొదటి ర్యాంకు నుంచే కొన్ని మండలాలకు ఖాళీలు లేవని అధికారులు చెప్పుకుంటూ రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఏదో అయిపోయింది.. ఇక నుంచి అయిన ర్యాంకుల వారిగా ప్రణాళిక ప్రకారం చేద్దామని నిర్ణయం తీసుకున్న అధికారులకు సిఫార్సు లేఖలు అడ్డు తగిలాయి. సిఫార్సు లేఖలకు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ ఇద్దామంటే అప్పటికే పూర్తి అయిపోయాయి. దీంతో మేము సిఫార్సు లేఖ తెచ్చుకొన్నా తమ స్థానం తమకు కాకుండా మరొకరికి ఎలా ఇస్తారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే నాయకుల నుంచి అధికారులకు ఫోన్‌లు చేయించినట్లు సమాచారం. దీంతో సిఫార్సు లేఖల ఒత్తిడి ఉన్న స్థానాలకు సంబంధించి సరిదిద్దే ప్రయత్నం చేశారు. స్పౌజ్, ఇతర కేటగిరీల కింద కేటాయించిన వారితో పాటు మొదటి ర్యాంకుకు అనుగుణంగా ప్లేస్‌మెంట్స్ కేటాయించిన వారిని బురిడీ కొట్టించే పన్నాగం పన్నారు. ఇందులో స్పౌజ్ కింద వారికి ర్యాంకు ఉండటంతో ఇవ్వాల్సి వచ్చిందని, ర్యాంకు ఉన్నవారికి స్పౌజ్ కేటగిరి కింద ఇవ్వాల్సి వచ్చిందని చెప్పే ప్రయత్నం చేశారు. అయితే అలా ఎలా జరుగుతుందని ఎదురు తిరిగిన వారితో వినతుల స్వీకరిస్తున్నారు. దీంతో బాధితులు డీపీఓ కార్యాలయానికి క్యూ కట్టారు.

కొడుకు అక్రమంగా ఆస్తి రాయించుకున్నాడు

- అధికారులు స్పందించడం లేదు
- కలెక్టర్‌కు వృద్ధురాలి ఫిర్యాదు


వృద్ధురాలు రామలక్ష్మమ్మ

అనంతపురం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తన బాగోగులు చూడని కొడుకు ఆస్తినంతా అక్రమంగా బదలాయించుకున్నాడనీ, న్యాయం చేయమంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఓ వృద్ధురాలు.. కలెక్టరేట్‌లో అధికారులకు విన్నవించుకుంది. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో రామలక్ష్మమ్మ వినతిపత్రం అందజేసింది. గతంలో అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నివాసముంటున్న తాను ప్రస్తుతం హైదరాబాద్‌లోని కుమార్తె భ్రమరాంబ వద్ద ఉంటున్నానని తెలిపింది. భర్త పర్వతయ్య 2017లో మృతి చెందాడనీ, కుమార్తెలు లలితమ్మ, మల్లీశ్వరి, భ్రమరాంబ, కుమారుడు వెంకటశివయ్య ఉన్నారని చెప్పింది. కుమారుడు వివాహమైనప్పట్నుంచి తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఓ రోజు ఆస్తి డాక్యుమెంట్లు చూస్తానని ఇప్పించుకుని, తాములేని సమయంలో వాటిని తీసుకెళ్లాడని ఆరోపించింది. కొంతకాలానికి తన రెండో కుమార్తె మల్లీశ్వరి మృతిచెందిందని తెలిపింది. తన కుమారుడు దొంగ వీలునామా సృష్టించుకుని, తన భర్త బొటనవేలి ముద్ర వేసుకుని తమ ఆస్తులను అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలోని సర్వేనెంబరు 29/2లో 9.28 ఎకరాలు, కూడేరు మండలం ఇప్పేరులోని సర్వే నంబరు 722/1, 723/1ఏలోని భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించింది. ఈ విషయంపై కోర్టుకెళితే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని వివరించింది. బోగస్ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆధారంగా భూమి ఎక్కించారని ఆరోపించారు. సమస్య పరిష్కరించాలని అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోయింది.

న్యాయం చేయండి

జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కార్యాలయంలో గతంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని పలువురు.. అధికారులను ఆశ్రయించారు. ప్రభాకర్, శివశంకర్, ప్రమీళ, చంద్రశేఖర్, సోమశేఖర్ తదితరులు వినతిపత్రం అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖలో 2007 నుంచి 2016 వరకు పనిచేశామనీ, ఉన్నఫలంగా తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించి, న్యాయం చేయాలని కోరారు.

బదిలీల్లో అన్యాయం...

వార్డు వెల్ఫేర్ సెక్రటరీల బదిలీల కౌన్సెలింగ్‌లో స్పౌజ్ కేటగిరీకి చెందిన కొందరు బోగస్ సర్టిఫికెట్లతో లబ్ధి పొందారని నవోదయకాలనీకి చెందిన శ్రీకాంత్ ఆరోపించాడు. కొందరు అధికారుల సహకారంతోనే ఇలా చేశారన్నారు. బదిలీ ఉత్తర్వులను నిలుపుదల చేయించాలని కోరాడు.

పారదర్శకతకు పాతర..!

(5వ పేజీ తరువాయి)

మరీ ఓ ఉన్నతాధికారి అనౌన్స్ చేసేదాకా పరిస్థితి దిగజారింది. మెరిట్ ప్రకారం పిలిచినా.. తాము కోరుకున్న స్థానాలు జాబితాలో లేకపోవడంతో కొందరు నిలదీశారు. ఆందోళనకు దిగారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. మొత్తంగా.. ప్రభుత్వానికి కావాల్సినంత చెడ్డపేరు వచ్చింది. నోరు లేని చిరుద్యోగుల పట్ల ఇంత దారుణం వ్యవహరిస్తుంటే... జిల్లా సర్వోన్నతాధికారి అటువైపు కన్నెత్తి చూడకపోవడం దేనికి సంకేతం..?

చెయాల్సిందంతా చేసి..!

అనంతపురం విద్య, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్స్ బదిలీలలో చేయాల్సిందంతా చేసిన ఆ శాఖ డీడీ రామాంజినేయులు.. సోమవారం అందుబాటులో లేకుండాపోయారు. 'ఎమ్మెల్యే లెటర్' పేరిట ఆయన బహిరంగంగా హల్‌చల్ చేశారు. మెరిట్ గురించి ఆయన ఏమాత్రం పట్టించుకోలేదు. కొందరు ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన స్థానాలనూ మార్చేసి, ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అంటున్నారు. 'మా పేరు చెప్పి ఎందుకు ఇలా చేశారు..?' అని కొందరు ఎమ్మెల్యేలు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇద్దరు ఎమ్మెల్యేలు ఆయనకు ఫోన్ చేసినా, స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో వారు సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. కౌన్సెలింగ్ సోమవారం తెల్లవారజాము వరకూ జరిగిందని, అందుకే ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారని ఆ శాఖ సిబ్బంది చెప్పుకొచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయని బాధితులు అంటున్నారు. న్యాయం కోసం పెన్నార్ భవన్‌లో సోమవారం సాయంత్రం వరకు కొందరు పడిగాపులు కాశారు. కానీ డీడీ అందుబాటులోకి రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

చిత్రజ్యోతి

SINCE 1965

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రానా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి


- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

ఆరు పోస్టులకు 171 దరఖాస్తులు

సెక్టోరల్ పోస్టులకు టీచర్లు పోటాపోటీ

అనంతపురం విద్య, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ)లో సెక్టోరల్ పోస్టులకు టీచర్ల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. సోమవారానికి దరఖాస్తు గడువు ముగియడంతో ఉన్న ఆరు పోస్టులకు 171 దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎస్జీ టీచర్లకు అవకాశం ఇవ్వడంతో పోటీ మరింత పెరిగినట్లు సమాచారం. ఏఎంఓ పోస్టుకు 37, అసిస్టెంట్ సీఎంఓ పోస్టుకు 48, అలెస్కో పోస్టుకు 45 దరఖాస్తులు అందినట్లు ఏపీసీ శైలజ తెలిపారు. ఏఎస్ఓ పోస్టుకు 13, అసిస్టెంట్ ఐఈడీ పోస్టుకు14, అసిస్టెంట్ ఏఎంఓ కన్నడ పోస్టుకు 14చొప్పన టీచర్ల నుంచి దరఖాస్తులు అందాయని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక బృందం ద్వారా నిబంధనల పరిశీలింపజేస్తున్నారు. ప్రకటనలో ఇచ్చిన మేరకు అన్నీ సక్రమంగా ఉన్న దరఖాస్తులను అర్హత జాబితాలో పెడతారు. ఆతర్వాత ఆయా టీచర్ల పనితీరును పరిగణించి పాయింట్లు కేటాయించి కలెక్టరుకు ఫైల్ పంపుతారు. అక్కడ ఆమోదం లభించిన తర్వాత అధికారికంగా ఎంపికైన అభ్యర్థులను ప్రకటిస్తారు. పోటీ అధికంగా ఉండటంతో దరఖాస్తు దారుల్లో ఉత్కంఠ నెలకొని ఉంది.

వేతనాలొచ్చేశాయ్..!

తాగునీటి పథకం కార్మికులకు జీతాలు, పీఎఫ్ బకాయిల విడుదల

అనంతపురం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు ఎట్టకేలకు వేతన వెతలు తీరాయి. కార్మికుల వేతన, పీఎఫ్ బకాయిలు విడుదలైనట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో పనిచేస్తున్న వారికి రూ.3.74 కోట్లు, మడకశిర నియోజకవర్గానికి సంబంధించి రూ.2.50 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 5 నెలల పీఎఫ్ బకాయిలు కూడా విడుదలయ్యాయన్నారు. మిగిలిన బకాయిలు త్వరలో చెల్లిస్తామన్నారు. దీంతో కార్మికులు సమ్మె మానుకుని తాగునీటి సరఫరా పునొరుద్ధరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కుందుర్పి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన కుమార్ (33) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు... కుమార్ తాపీమేస్త్రీ పని చేసేవాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన జోగి హనుమంతప్ప ఇంటి దగ్గర తాపీ పని చేసేందుకు మరో ఇద్దరితో కలిసి వెళ్లాడు. పని చేస్తుండగానే కుప్పకూలి కిందకు పడిపోయాడు. తోటి కూలీలు గమనించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గ్రామంలోని ఆర్ఎంపీ సూచనల మేరకు వారు కళ్యాణదుర్గం తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. కుమార్ తలకు మోకాళ్ల దగ్గర గాయాలు ఉన్నాయని, ఏదో జరిగిందని మృతుడి భార్య త్రివేణి చెప్పడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కారుణ్య నియామకాలకు చర్యలు

అనంతపురం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కారుణ్య నియామకాలపై సమీక్షించారు. నియామకాలకు సంబంధించి అవసరమైన చెక్‌లిస్ట్ తయారు చేయాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ మలోల, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, డిప్యూటీ తహసీల్దార్లు మారుతి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కుమారుడు, తమ్ముడికి గాయాలు



గంగాధర్ (ఫైల్)

పెనుకొండ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం కారు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమందేపల్లి మండలం నల్లగొండ్రాయనపల్లికి చెందిన గంగాధర్(42).. తమ్ముడు భాస్కర్, కుమారుడు ప్రణీత్‌తో కలిసి ద్విచక్రవాహనంలో పెనుకొండ వైపు బయల్దేరారు. ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ వద్దకు రాగానే సోమందేపల్లి నుంచి పెనుకొండ వైపు వస్తున్న కారు.. ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో గంగాధర్ అక్కడికక్కడే మృతిచెందగా.. భాస్కర్, ప్రణీత్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108 వాహనంలో పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. భాస్కర్, ప్రణీత్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

విద్యార్థి అదృశ్యం




మారుతీప్రసాద్‌రెడ్డి

రాప్తాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు గ్రామానికి చెందిన మాచిరెడ్డి ఆదినారాయణరెడ్డి కుమారుడు మారుతీప్రసాద్ రెడ్డి కనిపించకుండా పోయాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. మారుతీప్రసాద్‌రెడ్డి అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రోజూ మరూరు నుంచి కళాశాలకు వెళ్లి వచ్చేవాడు. ఈనెల 15న ఫోన్ రీచార్జి చేయించుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. గతంలో కూడా రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి, తర్వాత తిరిగొచ్చాడని కుటుంబీకులు తెలిపారు. డిగ్రీ పరీక్షలు ఎలా రాశావో హాల్‌టికెట్ చూపించమని అడగ్గా ఫెయిల్ అవుతాననే భయంతోనే వెళ్లిపోయి ఉంటాడని తల్లితండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తండ్రి ఆదినారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు, రేపు వాయిదాపడ్డ డీఎస్సీ పరీక్షలు

అనంతపురం విద్య, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమం నేపథ్యంలో గతనెల 20, 21 తేదీల్లో వాయిదాపడ్డ డీఎస్సీ పరీక్షలను మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు ప్రకటనలో తెలిపారు. మంగళవారం 2,511 మంది, బుధవారం 2,500 మంది అభ్యర్థులు జిల్లాలో పరీక్షలు రాస్తున్నారన్నారు.

భూలోక సురులు.. వైద్యులు



● నేడు డాక్టర్స్ డే

అనంతపురం వైద్యం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ప్రాణం పోస్తే... పోతున్న ప్రాణాన్ని నిలిపేవాడు వైద్యుడు. అందుకే వైద్యుడిని నడయాడే దేవుడిగా చాలా మంది కీర్తిస్తారు. తన వ్యక్తిగత సుఖాలను త్యాగం చేసి బాధితుల రోగం నయం చేసేవాడు డాక్టర్. నిరంతరం ఎన్నో ఒత్తిడుల మధ్య వైద్య వృత్తిని నిర్వహించే వైద్యులకు సమాజం కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిన అవసరం ఉంది. ప్రఖ్యాత వైద్యుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జనన, మరణ దినాలను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం జూలై ఒకటో తేదీని డాక్టర్ డేగా ప్రకటించింది.


మూడు తరాల వైద్యం..



మా అమ్మనాన్న డాక్టర్లుగా పనిచేసి ప్రజల్లో మన్నన పొందారు. వారి బాటలోనే మేము, మా పిల్లలు వైద్యవృత్తిని ఎంచుకుని సేవలందిస్తున్నాం. ఫార్మాకాలజీ ప్రొఫెసర్‌గా, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా మరిన్ని సేవలు అందించేందుకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. పరిపాలనా విభాగంలోనూ సంస్కరణలు తీసుకువచ్చి మరింత సులువుగా ప్రజలకు వైద్యసేవలందించేందుకు ఇదో చక్కని అవకాశం.

- డాక్టర్ షారోన్ సోనియ, ఫార్మాకాలజీ ప్రొఫెసర్

కొందరికే అవకాశం..



వైద్యవృత్తిలో పేదలకు సేవచేసే భాగ్యం సమాజంలోని కొందరికి మాత్రమే దక్కిన అవకాశం. అందులో మేము భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నాం. కీళ్లు, ఎముకల విభాగం ప్రొఫెసర్‌గా ఎన్నోరకాల శస్త్రచికిత్సలు చేశాం. ప్రమాదాలకు గురైనప్పుడు భరించలేని బాధతో బాధితులు డాక్టర్ల వద్దకు వస్తారు. సరైన చికిత్సతో వారి బాధ పోగొట్టి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఇంటికి పంపేటప్పుడు వారి కళ్లలో కనిపించే ఆనందాన్ని వర్ణించలేం.

- డాక్టర్ ఆత్మారామ్, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్

స్టార్ హాస్పిటల్ స్థాయిలో..



మెట్రోనగరాల్లోని స్టార్ హాస్పిటల్స్ స్థాయిలో న్యూరోసర్జరీ శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో మూడు సంవత్సరాల కిందట అన్ని సౌఖర్యాలతో న్యూరో సర్జరీ విభాగాన్ని ప్రారంభించాం. యాక్సిడెంట్, బ్రెయిన్ ట్యూమర్, పక్షవాతం తదితర కేసులకు దాదాపు వెయ్యికి పైగా మేజర్ సర్జరీలు చేశాం. ప్రతిఒక్కదానికి అపరేషన్ చేయగల పరికరాలున్నాయి. ప్రజల్లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌పై మంచి గుర్తింపును తీసుకువచ్చాం.

- డాక్టర్ భాస్కర్, న్యూరో సర్జరీ ప్రొఫెసర్

ప్రాణాలను ఫణంగా పెట్టి..



సమాజంలో కొవిడ్ వంటి మహమ్మారులు విజృంభించినపుడు డాక్టర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేస్తారు. వృత్తిలో భాగంగా రోజు వారి జీవన్మరణ నిర్ణయాలు తీసుకోవడంలో మానసిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రతి రోగ నిర్ధారణ, చికిత్స ప్రణాళిక వెనుక, మనల్ని ఆరోగ్యంగా ఉంచడానికి 24 గంటలూ పనిచేసే నిబద్ధత కలిగిన వైద్యులు ఉన్నారని గుర్తుంచుకోవాలి. ఈ నిపుణులు మనసమాజ నిర్మాణానికి ఎంత అవసరమో వర్ణించలేం.

- డాక్టర్ ఈబీ దేవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

ఉచితంగా గుండె ఆపరేషన్లు..



ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఖరీదైన గుండె ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నాం. ఐవీయూఎస్ ఆపరేషన్‌కు రూ.5లక్షల నుంచి రూ.7లక్షల వరకు అవుతుంది. ఇలాంటివి 80 ఆపరేషన్లు చేశాం. అదేవిధంగా హార్ట్ రేట్ తక్కువున్న వారికి పేస్‌మేకర్ మిషన్‌ను అమర్చుతాం. ఒక్కో ఆపరేషన్‌కు రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుంది. కార్నరీ యాంజియోగ్రామ్ 1200, కార్నరీ యాంజియోప్లాస్టీ 450 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశాం. డాక్టర్‌గా పేదలకు ఇలాంటి సేవ చేయడం వరంగా భావిస్తాం.

- డాక్టర్ సుభాష్ చంద్రబోస్, కార్డియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్

థ్యాంక్స్ ఒక ప్రోత్సాహం..



ఒక పేషెంట్ రీకవరీ అయిన తరువాత డాక్టర్‌కు థ్యాంక్స్ చెప్తారు. ఈ పదం డాక్టర్లకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తుంది. పదిమందికి సాయం చేయడానికే వైద్యవృత్తిని ఎంచుకున్నా. గత 22 సంవత్సరాలుగా సేవలందిస్తూ వస్తున్నా. డిపార్ట్‌మెంట్‌ను బాగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ ఆర్ఎంఓగా పనిచేస్తున్నా. జీవితాన్ని ప్రసాదించిన ఆసుపత్రికి తిరిగా సేవ చేసే భాగ్యం దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. ఒక పేషెంట్‌ను రీకవరీ చేయాలంటే అన్నిరకాల వనరులు ఉంటేనే బాగు చేయగలం.

- డాక్టర్ హేమలత, డిప్యూటీ సివిల్ సర్జన్

దేనికైనా రెడీ..!

ఎక్కడికి రావాలో చెప్పు..!

జేసీ ప్రభాకర్ రెడ్డికి పెద్దారెడ్డి సవాలు



ఎస్పీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న పెద్దారెడ్డి

అనంతపురం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): 'నేను దేనికైనా రెడీ..! ఆయన ఎక్కడికొస్తాడో రమ్మను. ఎక్కడికి రావాలో ఆయనే చెప్పినా పరవాలేదు..' అని జేసీ ప్రభాకర్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి సవాలు విసిరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైసీపీ నాయకుడు వెన్నపూస రవీంద్రారెడ్డితో కలసి ఆయన సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలిశారు. తాడిపత్రిలో వైసీపీ 'రీకాల్' కార్యక్రమం నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి అనుమతి ఇవ్వాలని నాయకులు ఎస్పీని కోరారు. వినతిపత్రం తీసుకున్న ఎస్పీ, పరిశీలిస్తామని అన్నారు. అనంతరం వైసీపీ నాయకులు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో ప్రజలను మోసం చేసిందని అనంత అన్నారు. అందుకే 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం పెద్దారెడ్డి తాడిపత్రికి వెళితే పోలీసులు అడ్డుకుని, అనంతపురం తీసుకొచ్చి వదిలేశారని అన్నారు. తాడిపత్రిలో ఎందుకు ప్రత్యేక పరిస్థితులున్నాయో అర్థం కావడం లేదని అన్నారు. పోలీసు యంత్రాంగం పెద్దారెడ్డికి అనుమతి ఇవ్వాలని, లేకుంటే ఏం చేయాలో కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. అనంతరం పెద్దారెడ్డి మాట్లాడుతూ, తాడిపత్రిలో తనను అడుగు పెట్టకుండా చూస్తున్నారని అన్నారు. 'నా ఇంటి దగ్గరకొచ్చిన వాళ్లను రప్పా రప్పా నరుకుతా అంటున్నాడు. మా కార్యకర్త షాప్‌ను ధ్వంసం చేశారు. వైసీపీ వాళ్లపై కేసులు నమోదు చేస్తున్నారు. నన్ను సొంత ఇంటికి పోనివ్వడం లేదు. సీఎం ఆదేశాలున్నాయా...? లేక పోలీసులే ఇలా చేస్తున్నారా? లేక వీళ్ల బాస్ జేసీ ప్రభాకర్ రెడ్డి చెబుతున్నారా..?' అని ప్రశ్నించారు. తాను గతంలో దౌర్జన్యాలు చేశానని అంటున్నారని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని అన్నారు. 'మా పార్టీ వాళ్లను శాసించడానికి నువ్వెరు..? ఆఫ్టరాల్ మున్సిపల్ ఛైర్మన్‌వి' అని మండిపడ్డారు. తాడిపత్రిలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఖూనీ అయ్యాయని మాజీ ఎంపీ మాధవ్ అన్నారు. జిల్లాలో ఒకప్పుడు ఫ్యాక్షనిజం, రౌడీయిజం లేకుండా పోలీసు వ్యవస్థ పనిచేస్తే.. ప్రస్తుతం కొత్త తరహాలో పనిచేస్తోందని విమర్శించారు.

వెంట వచ్చారో..!



చేతిలో తుపాకీతో సీఐ సాయిప్రసాద్

తాడిపత్రి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పెద్దారెడ్డి రాకతో రెండు రోజుల క్రితం తాడిపత్రిలో ఉద్రిక్తత తలెత్తిన విషయం తెలిసిందే. పోలీసులు ఆయనను తిరిగి అనంతపురం తరలిస్తుండగా వైసీపీ కార్యకర్తలు పోలీసుల వాహనాన్ని వెంబడించే ప్రయత్నం చేశారు. దీంతో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు భావించారు. వారిని హెచ్చరించేందుకు పట్టణ సీఐ సాయిప్రసాద్ పిస్టల్ చేతిలోకి తీసుకున్నారు. ఎవరూ వెంట రావద్దని హెచ్చరించారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఇరువర్గాలపై కేసు నమోదు

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వచ్చిన సమయంలో ఆయన ఇంటి వద్ద, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటి వద్ద భారీ ఎత్తున వారి వర్గీయులు పోగయ్యారు. శాంతిభద్రతల సమస్య తలెత్తేలా వ్యవహరించినందుకు పోలీసులు రెండు వర్గాలవారిపై కేసులు నమోదు చేశారు. వైసీపీ మద్దతుదారులు హనుమంతరెడ్డి, రవితేజారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు, టీడీపీ మద్దతుదారులు కొత్తపల్లి మల్లికార్జున, సుదర్శన్‌రెడ్డి, పరమేశ్, ఖాదర్, యాసీన్ తదితరులపై సుమోటోగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బంగారం తాకట్టు పెట్టిన సొమ్ము దొంగలపాలు..!

ఉరవకొండలో పగలే రెండుచోట్ల చోరీలు

రూ.2.26 లక్షల నగదు అపహరణ



విచారణ చేస్తున్న కానిస్టేబుల్

ఉరవకొండ, జూన్30(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో బంగారం తాకట్టుపెట్టి తీసుకున్న డబ్బును దుండగులు చోరీ చేసుకెళ్లారు. పట్టణంలో సోమవారం పగలే రెండు చోరీలు జరిగాయి. ద్విచక్ర వాహనాల్లో ఉంచిన రూ.2.26 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఒకటి, టవర్‌క్లాక్ కూడలిలో మరొకటి జరిగాయి. మండలంలోని మోపిడి గ్రామానికి చెందిన గొర్తి శ్రీనివాసులు పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంకులో రెండు తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.88వేల నగదు తీసుకున్నాడు. బ్యాంకు ముందే ద్విచక్రవాహనంలో డబ్బు పెట్టి, పక్కన మరొకరితో మాట్లాడుతుండగా.. గుర్తుతెలియని దుండగుడు ఎత్తుకెళ్లాడు. విడపనకల్లు మండలం చీకలగుర్కి గ్రామానికి చెందిన ఓబులేసు పంట పెట్టుబడి కోసం మూడు తులాల బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టగా వచ్చిన వచ్చిన డబ్బును ద్విచక్రవాహనంలోని బ్యాగులో ఉంచాడు. భార్యతో కలిసి కూరగాయలు కొనేందుకు టవర్‌క్లాక్ వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు వాహనంలో ఉన్న రూ.1.38 లక్షలను అపహరించుకు వెళ్లారు. బ్యాంకుల్లో రుణాల రెన్యువల్, సోమవారం కావడంతో రద్దీని దృష్టిలో ఉంచుకుని చోరీలు చేసి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అస్వస్థతతో రైతు మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ (53) అస్వస్థతతో సోమవారం మరణించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనారాయణ 3 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. ఉదయం పంటకు క్రిమిసంహారక మందు పిచికారీ చేసి, ఇంటికొచ్చాడు. కొద్దిసేపటి తరువాత ఉన్నఫలంగా అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రైతుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కాలేజీకి వెళ్లుంటే.. బతికేవాడివే..!

ట్రాక్టర్ కింద పడి విద్యార్థి మృతి

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



జశ్వంత్ (ఫైల్)

లేపాక్షి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కాలేజీకి వెళ్లాల్సిన విద్యార్థి.. రేపు వెళ్తానని చెప్పి సరదాగా బయటికెళ్లాడు. స్నేహితుడు ట్రాక్టర్ నడుపుతుండగా.. అతడి వెంట వెళ్లాడు. ట్రాలీ వద్ద నిల్చుని వెళ్తూ.. పట్టుతప్పి పడిపోయాడు. ట్రాలీ కింద పడి చనిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. 'కాలేజీకి వెళ్లుంటే బతికేవాడివి కదా..' అంటూ రోదించారు. మండలంలోని ఉప్పరపల్లిలో సోమవారం ట్రాక్టర్ కింద పడి డిప్లొమా విద్యార్థి జశ్వంత్ (17) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, శ్రీలత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు జశ్వంత్ మదనపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతుండేవాడు. సెలవులు కావడంతో ఉప్పరపల్లికి వచ్చాడు. సోమవారం కాలేజీకి వెళ్లాల్సి ఉండగా ఈరోజు ఇంట్లో ఉండి మంగళవారం వెళ్తానని తల్లిదండ్రులను ఒప్పించాడు. ఇదే సమయంలో గలిబిపల్లి చెరువు నుంచి ట్రాక్టర్లతో పొలాలకు మట్టిని తోలుతున్నారు. ఓ ట్రాక్టర్‌కు తన స్నేహితుడు డ్రైవర్‌గా వెళ్తుండడంతో జశ్వంత్ కూడా వెళ్లాడు. ట్రాలీ వద్ద నిల్చుని వెళ్తుండగా పట్టుతప్పి కిందపడ్డాడు. విద్యార్థిపై ట్రాలీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదంపై లేపాక్షి పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో వృద్ధుడి అరెస్టు

యాడికి, జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన 55 ఏళ్ల ఆదెప్పను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి ఆడుకుంటున్న బాలికపై ఆదెప్ప అత్యాచారానికి యత్నించాడు. పసిగట్టిన బాలిక తల్లిదండ్రులు.. అతడికి దేహశుద్ధి చేశారు. ఆదెప్ప తప్పించుకుని, పారిపోయాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ మేరకు ఆదెప్పను అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం

● హత్య కేసును ఛేదించిన పోలీసులు ● నిందితులు అన్నదమ్ములు

హిందూపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పురం ప్రాంతంలో సంచలనం సృష్టించిన మొండెం, తల వేరుచేసిన హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు నిర్ధారించారు. హత్యకేసు వివరాలను సోమవారం స్థానిక తన కార్యాలయం వద్ద డీఎస్పీ మహేష్ వెల్లడించారు. లేపాక్షి మండలం మైదుగోళం గ్రామానికి చెందిన రవికుమార్ అదే ఊరికి చెందిన బోయ ఆనంద్ భార్య శాంతమ్మతో కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలిసిన బోయ ఆనంద్, అతడి తమ్ముడు గోవిందరాజులు పలుసార్లు రవికుమార్‌ను హెచ్చరించారు. అయినా రవికుమార్ మారలేదు. దీంతో అతడిని హతమార్చాలని పథకం పన్నారు. అందులో భాగంగా ఆనంద్, గోవిందరాజులు ఈనెల 24న సాయంత్రం రవికుమార్‌ను మద్యం తాగడానికి రమ్మన్నారు. ఇందుకు ఒప్పుకుని ఇంటి నుంచి చికెన్ చేయించుకుని వెళ్లారు. గ్రామ సమీపంలోని బీడు భూమిలో కూర్చుని మద్యం తాగించారు. రాత్రి 10 గంటల సమయంలో రవికుమార్ మత్తులోకి జారుకోవడంతో అదే అదనుగా భావించి అప్పటికే ఆ ప్రాంతంలో దాచి ఉన్న వేటకొడవలి తీసుకొచ్చి గోవిందరాజు అతికిరాతకంగా నరికి తల, మొండెం వేరుచేశారు. తలను ప్లాస్టిక్ సంచిలో వేసి పక్కనే ఉన్న నీటికుంటలో పడేశారు. మొండెం అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఈనెల 25న సాయంత్రం రవికుమార్ తండ్రి అశ్వత్థప్ప లేపాక్షి పోలీసు స్టేషన్‌లో తన కుమారుడు కనిపించడంలేదని ఫిర్యాదు చేశాడు. పోలీసులు మొదట మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. రవికుమార్‌ను హత్య చేశారని 26న ఉదయం అతడి భార్య గీత.. లేపాక్షి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామ సమీపంలో మృతదేహం ఉందని తెలిపింది. దీంతో హత్యకేసుగా మార్చిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. నీటి కుంటలో ఉన్న తలను తీసుకుని శవపంచనామా చేయించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. డీఎస్పీ మహేష్, రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర.. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం మైదుగోళం గ్రామ సమీపంలో ఉండగా నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరంచారు. వారిరువురిని అరెస్టు చేశారు సమావేశంలో సీఐలు జనార్దన్, అబ్దుల్‌కరీం, ఎస్ఐలు నరేంద్ర, మునీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ: డీఆర్‌డీఏ పీడీ

అనంతపురం అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జూలై నెలకు సంబంధించి మంగళవారం ఉదయం నుంచి ఇంటి వద్దనే లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు. జూలై నెలకు సంబంధించి జిల్లాలోని 2,80,355 మంది లబ్ధిదారులకు రూ.124.74 కోట్ల పింఛన్ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఉదయం 7 గంటల నుంచి పింఛన్ల సొమ్మును లబ్ధిదారుల ఇంటి వద్దకే సిబ్బంది వెళ్లి అందజేస్తారన్నారు. మంగళ, బుధవారాల్లో రెండురోజులు పింఛన్ సొమ్మును అందజేస్తారన్నారు. తొలిరోజే పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. తొలి రోజు తీసుకోనివారు మరుసటి రోజు సచివాలయం వద్దకు వెళ్లి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పింఛన్ సొమ్ము తీసుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్

నేడు పింఛన్ పంపిణీకి ఎమ్మెల్యే రాక

నల్లచెరువు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉబ్బిచెర్ల పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మంగళవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారని టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు, తెలుగుయువత అధ్యక్షుడు గుప్తప్రసాద్ తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

● నల్లమాడ: మండలంలో పింఛన్ల పంపిణీకి మంగళవారం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శవశంకర్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లితండా, రెడ్డిపల్లి బీసీకాలనీ, కమ్మవారిపల్లి, నల్లమాడ క్రాస్ బీసీ కాలనీ, చౌట కుంటపల్లి గ్రామాల్లో పింఛన్ పంపిణీలో ఆమె పాల్గొంటారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆశా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఎగువపల్లి పంచాయతీ కె. బత్తలపల్లిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి వినోద్ తెలిపారు. జూలై 4లోగా ఆసుపత్రిలో దరఖాస్తు అందించాలన్నారు.

● అమడగూరు: మండలపరిధిలోని కందుకూరివారిపల్లిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్లు సోమవారం స్థానిక వైద్యాధికారి డాక్టర్ అపర్ణ తెలిపారు.

● తనకల్లు : మండలంలోని బొంతపల్లి, చీకటిమానుపల్లి, టి. సదుం, కొర్తికోట గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టు లకు దరఖాస్తులు చేసుకోవాలని వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు తెలిపారు.

నేత్రదానం

ధర్మవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో మరో ఇద్దరికి కంటిచూపు ప్రసాదించవచ్చని యువర్స్ ఫౌండేషన్‌ప్రతినిధులు పేర్కొన్నారు. పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన యలవర్తి అచ్చమ్మ(90) సోమవారం రాత్రి మృతిచెందారు.దీంతో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి సహకారంతో జిల్లా అంధత్వ నివా రణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డీవై కుళాయప్ప, కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర ఆప్తాల్మిక్ ఆఫీసర్ సికిందర్ నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వైకే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ


మైక్‌సెట్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఓబుళదేవరచెరువు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-20 సంత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం మైక్ సెట్‌ను విరాళంగా ఇచ్చారు. రూ.8వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం విజయ్ కుమార్‌కు పూర్వ విద్యార్థులు వెంకటేష్, శ్రీనివాస్, వెంకటరామిరెడ్డి, ఫైర్ రమణప్ప అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవన్‌కుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ట్రాక్టర్ ఢీ - ఒకరికి తీవ్ర గాయాలు

తనకల్లు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొగిల చెట్లతండా గ్రామ సమీపంలో సోమవారం ఆటో, ట్రాక్టర్ ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారు. మండలపరిధిలోని మొగిలి చెట్లతండాకు చెందిన పదిమంది కూలీలు తమ గ్రామం నుంచి కూలి పనుల కోసం కొక్కంటి క్రాస్‌కు వెళ్లారు. కూలి పనుల అనంతరం ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా కోటపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకుంది. ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు కాగా, నిర్మలమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన ఆమెను 108 వాహనంలో కదిరి ప్రభుతాసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు

మహిళపై హత్యాయత్నం?

ధర్మవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతానగర్‌కు చెందిన రమాదేవి అనే వివాహిత మహిళపై ఆదివారం అర్ధరాత్రి హత్యాయత్నం జరిగినట్లు సమాచారం. రమాదేవి ఆదివారం రాత్రి మొదట పిట్స్ వచ్చాయని ధర్మవరంప్రభుత్వాస్పత్రికి వచ్చింది. అయితే అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. తనపై హత్యాయత్నం జరిగిందని ఆమె సోమవారం ఆమె అనంతపురం ఆస్పత్రిలో కేసు పెట్టారని గీతానగర్ వాసులు చెబుతున్నారు. ఈ విషయంపై ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా రమాదేవిపై హత్యాయత్నం జరిగిన విషయం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె కోలుకున్న తరువాత గానీ లేదా ఆమెకు సంబంధించిన వారు వచ్చి ఫిర్యాదు చేస్తే కానీ తెలియదన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

నల్లచెరువు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట పల్లికి చెందిన ఇరువర్గాలు పాతకక్షలతో గొడవపడ్డ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణ సోమవారం తెలిపారు. ఎర్రగుంటపల్లికి చెందిన క్రిష్టయ్య కుటుంబానికి అదే గ్రామానికి చెందిన రాజు కుటుంబానికి ఐదేళ్ల నుంచి పాతకక్షలు ఉన్నాయన్నారు. రాజు కుటుంబం తనకల్లు మండల కేంద్రాని కెళ్లి అక్కడే నివాసముంటున్నారు. రాజు ఈ నెల 27న స్వగ్రామానికి వచ్చి బంధువులతో మాట్లాడుతున్నాడు. ఈ సమయంలో ఎస్సీ వర్గానికి చెందిన క్రిష్టయ్య ఎదురుగా రావడంతో రాజు అతడి కులంపేరుతో దుర్భాషలాడి దాడికి పాల్పడ్డాడు. ఆ తరువాత రాజు తన కుమారులైన నందకిషోర్, నవీన్‌ను గ్రామానికి పిలుచుకొచ్చి తమ ఇంటి వద్ద కులం పేరుతో దూషించాడని క్రిష్టయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు రాజు, నందకిషోర్, నవీన్‌పై ఎస్సీ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పౌరహక్కుల దినోత్సవం

కదిరి అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్లతండా గ్రామంలో సోమవారం అధికారులు జాతీయ పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హులైనవారు ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. అలాగే హక్కులు, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి, అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కట్లతండాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో..?

● గుంతలమయమై అధ్వానంగా మారిన వైనం
● అవస్థలు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు


చౌటకుంటపల్లి నుంచి కదిరి ప్రధాన రహదారికి లింక్‌రోడ్డు ఇలా...

నల్లమాడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రోడ్లు గుంతలమయమై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి యేడాది పూర్తి అయినా నల్లమాడ మండలంలో ఆ రోడ్లలో మార్పులేదు. మండలంలోని శీకివారిపల్లికి రెడ్డిపల్లి - మలకవేమల ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్ల తారు రోడ్డును 15 యేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వంలో వేశారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఆ రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. రోడ్డంతా గుంతలు పడి అధ్వానంగా మారింది. ఆటోలు, ద్విచక్రవాహనాల్లో వెళ్తుంటే ఎగుడు దిగుడుగా ఉన్న ఆ రోడ్డులో ఎక్కడ జారిపడతామో అనే భయం వేస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. శీకి వారిపల్లిలో బడా రాజకీయ నాయకులు ఉన్నా, ఆ రోడ్డు పరిస్థితి మార్చే నాథుడే లేరని గ్రామస్థులు వాపోతున్నారు. ఆ గ్రామస్తులకు రా త్రిపూట ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే రాత్రి ఆ సమయంలో గ్రామానికి ఆటోలు రావు. దీంతో ద్విచక్రవాహనాల్లోనే ఆ గుంతల రోడ్డులో వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు.

చౌటకుంటపల్లి లింక్ రోడ్డు ఇలా...

నల్లమాడ-కదిరి-దొన్నికోట ప్రధాన డబుల్‌రోడ్డుకు చౌటకుంటపల్లి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో లింక్ ఉంది. ఈ తారు రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. గతంలో కదిరి నుంచి దొన్నికోట మీదుగా నల్లమాడకు వేళ్లే ప్రతి బస్సు ఈ లింక్ రోడ్డు మీదుగా నల్లమాడకు చేరేవి. ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో ద్విచక్రవాహనాలు కూడా వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. దీంతో ప్రస్తుతం కదిరి నుంచి నల్లమాడకు వెళ్లే బస్సులు ఈ రోడ్డు మీదుగా రాకుండా ఎద్దులవాండ్లపల్లి తండా మీదుగా వెళుతున్నాయి. దీంతో చౌటకుంటపల్లి, ఎద్దులవాండ్లపల్లి గ్రామ స్థులు కదిరికి వెళ్లాలంటే ఎద్దులవారిపల్లితండాకు గానీ, నల్లమాడ క్రాస్‌కు గానీ వెళ్లాల్సి వస్తోంది. అలాగే ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువు తున్న చౌటకుంటపల్లికి చెందిన 60 మంది విద్యార్థులు బస్సు వసతి లేకపోవడంతో నల్లమాడ జిల్లా పరిషత్ పాఠశాలకు ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

ఇప్పటికీ బండి బాటే గతి

రాగానిపల్లి నుంచి రాగానిపల్లి తండాకు రెండు కిలోమీటర్ల బండి బాట ఉంది. దాదాపు తండా ఏర్పడి నప్పటి నుంచి రాగానిపల్లి నుంచి ఈ బండి బాటలోనే తండాకు వెళ్తున్నా రు. ఎన్నికల్లో తండాకు వెళ్లిన నాయకులు తారు లేక సిమెంటు రోడ్డు వేస్తామని హామీలు ఇస్తున్నారే కానీ, ఏళ్లు గడుస్తున్నా వారి హామీలు నెరవేరడం లేదని తండా వాసులు వాపోతున్నారు. అంతేగాకుండా ఈ బండి బాటకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి, రోడ్డుకు అడ్డంగా ఉన్నాయి. వర్షం వస్తే బండిబాటలో నీరు నిలువ ఉండి ద్విచక్ర వాహనాలే గాకుండా నడవడానికి కూడా వీలు లేకుండా పోతుందని అంటున్నారు. అలాగే నల్లమాడ నుంచి సోము గుట్టపల్లి, కొండ్రవారిపల్లి, కుటాలపల్లితండా వరకు ఉన్న తారు రోడ్డు పూర్తిగా గంతలమయం. నల్లమాడ-పుట్టపర్తి ప్రధాన రోడ్డు నుంచి పెమనకుంటపల్లి వరకు రెండు కిలోమీటర్ల తారురోడ్డు, నల్లమాడ నుంచి చెరువువాండ్లపల్లి, కొత్తపల్లి వెళ్లే రోడ్డు అడుగుకోగుంత, మూరకో గుం తలాగా దర్శనమిస్తాయి. గత ప్రభుత్వంలో ఈ రోడ్లలో గుంతలకు తట్టెడు మట్టికూడా వేయక పోవడంతో మరింత గుంతలు ఏర్పాడ్డయని ఆయా గ్రామస్థులు మండి పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా, ఇంతవరకు పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.


రాగానిపల్లి నుంచి రాగానిపల్లితండాకు వెళ్లే బండిబాట

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్


ఓబుళదేవరచెరువు సమావేశంలో మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

నల్లమాడ/ఓబుళదేవరచెరువు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాల అమలులో విఫలమైందని, వెంటనే అమలు చే యాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఎం కాలనీలో రెండో మహాసభను కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఐ జెండా ఆవిష్కరించి, వేమయ్య యాదవ్ మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల కార్యదర్శి గా వెంకటరమణ, సహాయ కార్యదర్శులుగా నాగేంద్ర, గంగాధర్‌ను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆంజి, కదిరప్ప, మధునాయక్, హన్సర్, రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలకేంద్రమైన ఓబుళదేవర చెరువులోని షాదీ మహాల్‌లో సీపీఐ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండో మండల మహాసభను నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ జెండాను ఆవిష్కరించి, తరువాత ర్యాలీ చేశారు. మహా సభలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో రైతులకు తీవ్ర సంక్షోభం నెలకొందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండలకార్యదర్శి చలపతినాయుడు, రైతు సంఘం కార్యదర్శి పూల శ్రీనివాసులు, రత్నబాయి, రామచంద్ర, సుధాకర్, ఆంజనప్ప తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నల్లచెరువు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రామాలయం పునర్నిర్మాణంలో భాగంగా సోమవారం ఆలయ పైకప్పును నిర్మించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు తమవంతుగా ఆలయ నిర్మాణానికి విరాళాలు అందించారు. బూచేపల్లి గోవిందరెడ్డి రూ.25వేలు, కోనపల్లి రమణారెడ్డి రూ.10వేలు, రమణారెడ్డి రూ.10,016, లక్ష్మీనారాయణ రూ.10 వేలుతో పాటు పలువురు విరాళాలు ఇచ్చారు. అన్నదానం చేశారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఎం

కదిరి అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీక్రిష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలోని సర్వే నంబర్ 720లో ఇళ్లు లేని పేదలు గుడిసెలు వేసుకున్నారని, వారందరికి స్థలాలు కేటాయించాలన్నారు. నాలుగు నెలలుగా గ్రామ సచివాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో పేదలు వ్యక్తిగత అర్జీలు ఇచ్చారని, ఇంతవరకు రెవెన్యూ అధికారులు వాటిని పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. విధిలేని పరిస్థితిలో పేదలు గుడిసెలు వేసుకున్నారని, వారికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం పేదలకు స్థలాలు కేటాయించాలని, లేని పక్షంలో గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో నిర్మాణాలు చేపడతామన్నారు. సీపీఎం నాయకులు జీఎల్ నరసింహులు, సాంబశివ, ముస్తాక్, రామమోహన్, బడా సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి అందరూ కృషిచేయాలి

● నాయకులు

ధర్మవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం కోసం అందరం కలిసికట్టుగా కృషిచేయాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని 15, 16 వార్డుల కమిటీల ఎంపికపై ఆదివారం టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్, చేనేత ప్రముఖుడు, టీడీపీ నాయకులు సంధా రాఘవ, జింకా పురుషోత్తం, తలారి చంద్ర మోహన్‌బాబు, అశోక్ స్థానిక నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ... రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమపథకాలపై వార్డులలో ప్రజలకు తెలియజేయాలన్నారు. రాబోవు మున్సిపల్ ఎన్నికలలో టీడీపీని గెలిపించేలా అందరూ కృషిచేయాలన్నారు. టీడీపీ నాయకులు పల్లెం క్రిష్ణ, సాగునీటి సంఘం అధ్యక్షుడు రేనాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మీ సేవలు మరువలేనివి: డీఎం


ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

కదిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో మీరు అందించిన సేవలు అత్యంత విలువైనవి, మరవలేనివని ఆర్టీసీ డీఎం మైనొద్దీన్ పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులను ఉద్దేశించి ఆయన సోమవారం పట్టణంలోని ఎన్ఎంయూ కార్యాలయంలో మాట్లాడారు. ఎస్ఎండీ షఫీ, ఏడీసీ, ఎ. రాధాక్రిష్ణ, ఎల్‌హెచ్. గట్టి అనంతయ్య కండెక్టర్, సి. బాబుఖాన్, కండెక్టర్ వీవీఎస్ రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. వారిని డీఎంతో పాటు యూనియన్ నాయకులు సన్మానించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ఆర్టీసీలో 30యేళ్లకుపైగా మీరు అందించిన సేవలు ఎప్పటికి సంస్థ మరవదన్నారు. ఆర్టీసీ ఆదాయం పెంపులో ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత జీవితం సుఖమయంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధికారి హరిమోహన్, భైరిశెట్టి, పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కాలనీలో వసతులు కల్పించాలి: సీపీఐ

ముదిగుబ్బ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా స్కూల్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు సోమవారం పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కస్తూర్బా స్కూల్ కాలనీలో ప్రారంభం నుంచి అనేక సమస్యలు తిష్ట వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 300 ఇళ్లకు పైగా ఉన్నాయని, 1000 మంది జనాభా నివసిస్తున్నారని తెలిపారు. వారు కనీస సౌకర్యాలకు కూడా నోచుకోకపోవడం దారుణమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కాలనీ సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సమష్టిగా మున్సిపాలిటీని అభివృద్ధి చేద్దాం

● కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి


కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీని అందరం కలిసికట్టుగా అభివృద్ధి చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశపు భవనంలో సోమవారం కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జేసీబీ రమణ, సాయిప్రసాద్ తదితరులు వారివారి వార్డుల్లోని సమస్యలను చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ ప్రమోద్ కుమార్ దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ప్రధానంగా వీధిలైట్లు, డ్రైనేజీ, సీసీరోడ్ల సమస్యలపై సమావేశంలో చర్చించారు. వార్డుల్లో అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. కౌన్సిలర్‌లు తీసుకొచ్చిన సమస్యలపై సంబంధిత అదికారులు సమాధానాలు ఇచ్చారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషిచేద్దామని పేర్కొన్నారు. సమావేశంలో మేనేజర్ రాజేశ్వరిబాయి. టీపీఓ విజయ్‌బాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్, ఆర్ఐ శివ, డీఈ వీరేశ్, ఏఈ కళావతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

● ధర్మవరం(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఐదు రోజులుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బొగ్గునాగరాజు, బాబు మండిపడ్డారు. ఈ మేరకు ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా అక్కడికి వెళ్లి తమ సమస్యలపై కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలపై గత ప్రభుత్వా నికి ఎన్నో సార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేద న్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి కూడా అనేక సార్లు వినతిపత్రాలు అందజేశామ న్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు వినతిపత్రంలో కోరారు. సమావేశంలో కార్మికసంఘం నాయకులు జయచంద్ర, అనిల్, దస్తగిరి, యోగి, కాటమయ్య, పెద్దన్న, నరసింహులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి: ఆర్డీఓ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ మహేశ్

ధర్మవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన ప్రతి అర్జీని విచారించి తక్షణమే పరిష్కరించాలని ఆర్డీఓ మహేశ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆర్డీఓ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు వారి సమస్యలపై ఆర్డీఓకు అర్జీలు ఇచ్చుకున్నారు. భూమి సర్వేకోసం ధర్మవరం, తాడిమర్రి మండలాల నుంచి రెండు చొప్పున, కనగానపల్లి, , చెన్నేకొత్తపల్లి, ముదిగుబ్బ, రామగిరి మండలాల నుంచి ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఎనిమిది ఫిర్యాదులు వచ్చాయి. వీటిని ఆయా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మొహర్రం జరుపుకోవాలి

ధర్మవరం(ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్డీఓ మహేశ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం మొహర్రం వేడుకలకు సంబంధించి పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... మొహర్రం సందర్భంగా తగిన భద్రతా చర్యలు, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, తాగునీటి సరఫరా, రాత్రివేళ విద్యుత్ సరఫరా, అత్యవసర సేవలు వంటి ఏర్పాట్లపై అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి శాఖ సమయానికి తమ సేవలు అందించాలన్నారు. ఊరేగింపు మార్గల్లో బలహీనమైన ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ, ఎంపీడీఓ, పోలీస్, మున్సిపల్ అధికారులు, వైద్యాధికారులు, రూరల్ వాటర్ సప్లై, విద్యుత్, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

అద్దెలు చెల్లించకుంటే జప్తు చేయండి

● కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు


సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్

కదిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ దుకాణాల అద్దెలు చెల్లించకపోతే జప్తు చేయాలని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషాను కోరారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో సోమవారం చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపాలిటీలో చాల సంవత్సరాల నుంచి పలువురు దుకాణాల అద్దెలు చెల్లించడం లేదని, దీంతో రూ. లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయన్నారు. బకాయిలున్నవారికి నోటీసులు ఇవ్వాలని కోరారు. అప్పటికి స్పందించకపోతే దుకాణాలను జప్తు చేయాలన్నారు. ఇంతవరకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని అధికారులను ప్రశ్నించారు. అలాగే పట్టణంలో తాగునీరు, చెత్తచెదారం, మురికినీటి కాలువలు తదితర సమస్యలపై చర్చించారు. ఈసమావేశంలో ఇన్‌చార్జ్ కమిషనర్ సందీప్, ఇతర అధికారులు ఉన్నారు.

పొలాల్లోకి వెళ్లకుండా కంచె ఏర్పాటు

● తహసీల్దార్‌కు విన్నవించిన రైతులు


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు, సీపీఐ నాయకులు

ధర్మవరం రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చురామి గ్రామానికి చెందిన రైతులు తమ పొలాలకు వెళ్లే రహదారికి అడ్డంగా కొంతమంది వ్యాపారులు కంచె ఏర్పాటు చేశారని రైతులు అవేదన వ క్తం చేశారు. సోమవారం ఆ గ్రామ రైతులు సీపీఐ నాయకుడు మధుతో కలసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో తహసీల్దార్ సురేష్‌బాబుకు వినతిపత్రం అందచేశారు. ఎన్నో ఏళ్లుగా తమ పొలాలకు ఆ రహదారికి గుండా వెళ్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల తమ పొలాలకు ముందు ఉన్న పొలాన్ని ధర్మవరానికి చెందిన శివకుమార్ కొనుగోలు చేసి రస్తా లేకుండా ముళ్లకంచె వేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ పొలాలకు రస్తా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రైతులు ముచ్చు రామకృష్ణ, లక్ష్మయ్య, నారాయణస్వామి, సీపీఐ నాయకులు పుల్లాశెట్టి రవికుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ ప్రారంభం ఎప్పుడో..?



ప్రారంభానికి నోచుకోని సోమయాజులపల్లి హెల్త్ క్లినిక్

గాండ్లపెంట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సోమయాజులపల్లిలో విలేజీ హెల్త్ క్లినిక్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారో అని ఆ గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. గ్రామీణులకు వై ద్యం అందించే లక్ష్యంతో గత ప్రభుత్వంలో దీనిని నిర్మించారు. దీని నిర్మాణానికి అప్పట్లో రూ.23లక్షల నిధులు కేటాయించారు. దీంతో నిర్మాణం పూర్తి అయి యేడాది అవుతోంది. అయితే కాంట్రాక్టర్‌కు ఇంకా 20శాతం బిల్లులు రావాల్సిఉందని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు అంటున్నారు. యేడాదిక్రితమే భవనం పూర్తి అయినా బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ తాళాలు ఇవ్వలేదని వైద్య సిబ్బంది చెబుతున్నారు. దీంతో గ్రామ సచివాలయంలోని ఓ భవనంలో అసౌకర్యాల నడుమ చికిత్సలు అందిస్తున్నారు. ఈ గ్రామ సచివాలయం పరిధిలో 13గ్రామాలు ఉన్నాయి. వీరికి వైద్యం అందించాలంటే సిబ్బంది ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టుకు రావాల్సిన బిల్లులు అందించి, నిర్మాణం పూర్తయిన హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ జేఈ రెడ్డివరప్రసాద్‌ను వివరణ కోరగా... కాంట్రాక్టర్‌కు కొద్దిగా బిల్లులు రావాల్సి ఉందని తెలిపారు. ఆ బిల్లులు వస్తే తాళాలు ఇస్తానని కాంట్రాక్టర్ చెప్పాడని జేఈ తెలిపారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య



మాట్లాడుతున్న డీసీ నాగమద్దయ్య

పెనుకొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని డీసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సారా రహిత రాష్ట్రంగా చేయాలని ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కర్ణాటక మద్యం రవాణా చేస్తున్నవారిపై నిఘా ఉంచి అరెస్టులు చేయాలన్నారు. నాటుసారా నిర్మూలన వేగవంతం చేయాలన్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలు, సమయపాలన వంటివి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు, శ్రీరామ్, పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సృజన్‌బాబు, ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, సిబ్బంది పాల్గొన్నారు. సోమందేపల్లి మండలంలో కల్లుదుకాణాన్ని పరిశీలించి శ్యాంపుల్స్ తీసి పరీక్షకు పంపించారు.

సాయిభజన బృందం గ్రామ సంకీర్తన

రొద్దం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సాయిబాబా సేవాట్రస్ట్ సభ్యులు గ్రామస్థాయి సంకీర్తన సేవలో పాల్గొన్నారు. మండలంలోని ఆర్.మరువపల్లి, కొట్టాల, పెద్దగువ్వలపల్లి, చిన్నగువ్వలపల్లి, పెద్దకోడిపల్లి, పెద్దిపల్లి తదితర గ్రామాల్లో పుట్టపర్తిసాయిబాబా చిత్రపటంతో ఊరేగింపు చేపట్టారు. సాయి సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొని పునీతులు కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్.మరువపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప, లింగమయ్య, శివశంకర్, రవిశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

రొద్దం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి సోమశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తురకలాపట్నం, రాగిమేకలపల్లి గ్రామాల ఆశ వర్కర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా గ్రామ సచివాలయ పరిధిలోనిగాని, రొద్దం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోగాని దరఖాస్తులు అందించాలని వైద్యాధికారి కోరారు. అదేవిధంగా చెరుకూరు సచివాలయ పరిధిలో అర్హులైన వారు దరఖాస్తులను పెద్దమంతూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అందజేయాలని డాక్టర్ రమ్య కోరారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన శ్రీధర్

గుడిబండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గుడిబండ తహసీల్దార్‌గా శ్రీధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్ ఉన్న కరుణాకర్ పదవీ విరమణ పొందగా ఆయన స్థానంలో పెనుకొండ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు.

పెనుకొండ టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ స్వాతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శ్రీధర్ గుడిబండకు బదిలీకాగా ఆయన స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలను డీటీ చేపట్టారు.

విజయవంతం చేయండి

మడకశిర టౌన్, జూన్30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకొన్న సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుపరిపాలనలో తొలిఅడుగు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, విజయవంతం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు సోమవారం ప్రకటనలో కోరారు. ఉదయం 10.30 గంటలకు శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరు అవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరుకావాలని కోరారు. ఉదయం 9గంటలకు నగర పంచాయతీ పరిధిలోని మాలేరొప్పం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఉంటుందని, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరు అవుతారన్నారు.

అమరాపురం, (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు శిక్షణ కార్యక్రమానికి మండల పరిధిలోని నాయకులు హాజరుకావాలని నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్ తెలిపారు.

జీవన మార్గదర్శకుడు గురువు

భరతమాత సేవా ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర ప్రసాద్

పావగడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి జీవన మార్గదర్శకుడు గురువు అని భరతమాత సేవాట్రస్టు అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్ అన్నారు. గురువు పాత్ర సమాజంలో ప్రముఖమైనదని పేర్కొన్నారు. సోమవారం తాలూకా పరిధిలోని మల్లమ్మనహళ్లి, పెన్నోబుళహళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డను ప్రపంచానికి పరిచయం చేస్తే గురువు సంస్కారవంతమైన విద్యను బోధించి ప్రపంచం తనవైపు దృష్టిసారించేలా చేయగలడని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి గోపాలకృష్ణ, సభ్యులు నాగరాజు, దినేష్, పాఠశాల హెచ్ఎంలు విజయలక్ష్మీ, గోవిందప్ప, తిమ్మప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటడం అభినందనీయం

మున్సిపల్ చైర్మన్ రమేష్



ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలికలు రగ్బీ పోటీల్లో జాతీయస్థాయిలో రెండోస్థానం దక్కించుకోవడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో కర్నూలు ఆదర్శ పాఠశాలలో జరిగిన పోటీల్లో హిందూపురం అంబేడ్కర్ పాఠశాల విద్యార్థినులు పాల్గొని చక్కటి ప్రతిభ చూపడంతో సోమవారం వారిని అభినందించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, మాలిక్, పీటీ రూప, టీడీపీ నాయకులు ఇందాద్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

అగళి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మధుడి తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడిగా లింగరాజ్, ప్రధాన కార్యదర్శిగా జగదీశ్‌యాదవ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు భూతరాజ్, బీసీసెల్ అధ్యక్షులు రాజగోపాల్‌ను ఎన్నుకున్నారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జిగా శివకుమార్, క్లస్టర్ ఉపాధ్యక్షుడిగా కమ్మరి శివన్న, తెలుగు యువత అధ్యక్షులుగా గోవిందరాజులును జడ్పీటీసీ ఉమేష్, మాజీ మండల కన్వీనర్ కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ కుమారస్వామి, ఎంపీటీసీ నాగోజీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకే మొగ్గు

- కంది, రాగిపై కూడా ఆసక్తి
- ప్రోత్సాహకంగా మద్దతు ధరలు
- వేరుశనగకు దూరమవుతున్న రైతులు



మొక్కజొన్న పంట

చిలమత్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో చాలాకాలంగా వేరుశనగ పంటను రైతులు సాగుచేస్తూ వస్తున్నారు. వర్షాధారంగా సాగయ్యే ఈ పంటకు ఇక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో ఎన్నో ఏళ్లుగా ఈ రెండు జిల్లాల ప్రజలు ఈ పంటనే లక్షల ఎకరాల్లో సాగుచేస్తూ వస్తున్నారు. అయితే వాతావరణంలో వస్తున్న మార్పులతో అనాదిగా సాగుచేస్తున్న ఈ పంటకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో రైతులు పంటను సాగుచేయడం, నష్టపోవడం జరుగుతూనే ఉంది. పంట సాగు పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవండతో ఆ పంటకు ప్రోత్సాహకాలు కూడా నిలిచిపోయాయి. ఈ కారణంగా రైతులు వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. అందులో ప్రధానమైనది మొక్కజొన్న పంట. ప్రస్తుతం ఈ పంట సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు. మండలంలో గత ఖరీఫ్ సీజన్‌లో 5917 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. ఈ ఏడాది మరింత ఎక్కువ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. హైబ్రీడ్ విత్తనాలు వాడటంతో ఎకరానికి 35 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయని రైతులు అంటున్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు రకాల పంటలకు మద్దతు ధరలు ప్రకటించి రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తోంది. పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, అక్కడ మద్దతు ధరతో పండిన పంటలను కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా మొక్కజొన్న పంట క్వింటాల్‌కి రూ.2400 మద్దతు ధర ప్రకటించింది. ప్రస్తుతం ఓపెన్ మార్కెట్లో క్వింటాళ్ ధర రూ.2200 వరకు పలుకుతోంది. తక్కువ పెట్టుబడులు, ప్రభుత్వ మద్దతు ధర కల్పించి మార్కెట్ సౌకర్యం కల్పించడం వంటివి మొక్కజొన్న రైతులకు కలిసొచ్చే అంశాలు. ప్రభుత్వం ప్రకటించిన బీమా జాబితాలో మొక్కజొన్నకు స్థానం కల్పించడంతో రైతుల చూపు మొక్కజొన్న పంట సాగుపై మరింత పడిందనడంలో సందేహం లేదు.

కంది, రాగిపై కూడా..

ప్రత్యామ్నాయ పంటలుగా రైతులు కంది, రాగిపై కూడా దృష్టి పెడుతున్నారు. ఈ పంటలకు మార్కెట్లో గిరాకీ ఉండటంతో గిట్టుబాటు ధరలు ఉంటున్నాయి. ఇతర పంటలతో పోలిస్తే కంది, రాగి సాగుకు పెట్టుబడులు కూడా తక్కువే. దీంతో ఈ పంటల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

తక్కువ పెట్టుబడితో సాగు



మొక్కజొన్న పంటకు తక్కువ పెట్టుబడి సరిపోతుంది. వేరుశనగ పంట సాగుచేయాలంటే ఎకరానికి రూ. 20 వేల వరకు ఖర్చు అవుతుంది. మొక్కజొన్నకు అయితే రూ.6 వేల వరకు ఖర్చు వస్తుంది. వర్షాలు తక్కువైనా, ఎక్కువైనా వేరుశనగ పంట చేతికందదు. మొక్కజొన్న పంట వర్షాలు కొంచెం అటూ ఇటైనా చేతికందుతుంది. మార్కెట్లో ధర కూడా బాగానే ఉంది. వేరుశనగ కంటే మొక్కజొన్నే మేలని అనిపిస్తోంది.

-కిష్టప్ప, చిన్నప్పరెడ్డిపల్లి

వేరుశనగతో లాభం లేదు



ఎన్నో ఏళ్లుగా వేరుశనగ పంటను సాగుచేస్తున్నాం. ఎప్పుడూ పంటలో లాభాలు వచ్చిన దాఖలాలు లేవు. పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి కూడా సాయం అందడం లేదు. దీంతో వేరుశనగ పంట సాగు బదులు మొక్కజొన్న పంట వైపు మొగ్గు చూపుతున్నాం. పెట్టుబడులు, గిట్టుబాటు ధరలను చూస్తే మొక్కజొన్న పంటే బాగుందని అనిపిస్తోంది.

-రంగారెడ్డి, కంబాలపల్లి

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తాం

మున్సిపల్ చైర్మన్ రమేష్

23 అంశాలను ఆమోదించిన కౌన్సిల్ సభ్యులు





మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్, హాజరైన సభ్యులు

హిందూపురం, జూన్30(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ అన్నారు. సోమవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన కౌన్సిలర్ ఆసిఫ్ మాట్లాడుతూ వార్డుల్లో పర్యటన సందర్భంగా కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణా కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడి ఇంటిలో పెట్టడం సరికాదన్నారు. మరో కౌన్సిలర్ నాగేంద్ర మాట్లాడుతూ ప్రతినెలా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలన్నారు. వైస్‌చైర్మన్ బలరాంరెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డుకు రూ.3లక్షల నిధులు కేటాయిస్తామని చెప్పడం అభినందనీయమని, సంబంధిత కౌన్సిలర్లతో అడగకుండానే ఇష్టమొచ్చినచోట పనులు పెట్టడం సరికాదన్నారు. నింకంపల్లి సమీపంలో బహిరంగంగా కర్ణాటక మద్యం, గంజాయి సేవిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మురుగు కాలువలు శుభ్రం చేసే పనుల్లో అక్రమాలు జరిగాయని ఒకే కాంట్రాక్టర్‌కు సింగిల్ టెండర్‌మీద పనులు అప్పగించడం వెనుక ఆంతర్యం ఏమిటని వైసీపీ కౌన్సిలర్ శివ ప్రశ్నించారు. అయితే ఈ సందర్భంలో వైస్ చైర్మన్ బలరాంరెడ్డి ఎమ్మెల్యే బాలకృష్ణపై షూటింగ్‌లకే పరిమితమయ్యాడని అనడంతో టీడీపీ కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ ఖండించారు. ఆయన ఎక్కడున్నా అభివృద్ధి జరుగుతుందా లేదా అని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. ఎమ్మెల్యేను విమర్శించడం మానుకోవాలని లేదంటే మీకు బుద్ధిచెబుతామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ మురుగు కాలువలు శుభ్రం చేయడంలో ఎక్కడా అక్రమాలు, అవకతవకలు జరగలేదని పని జరిగి ఉంటేనే బిల్లులు చేశారని అవసరమైతే వాటికి సంబంధించిన వాటిని మీడియా సమక్షంలో సభ్యుల ముందు ఉంచుతామన్నారు. అనంతరం అజెండాలోని 23అంశాలను కౌన్సిలర్లు ఆమోదించడంతో సమావేశం ముగిసింది. సమావేశం ప్రారంభంలో ఇటీవల ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన జవాన్‌కు నివాళులు అర్పించారు.

ప్రమాదకరంగా మలుపు



ప్రమాదాలకు కారణమవుతున్న మలుపు

పరిగి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కొడికొండ-శిర జాతీయరహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మండల పరిధిలోని కూడలిలో పరిగి-ఊటకూరుకువెళ్లే రహదారిని దాటాలంటే ఇరువైపులా ముళ్లపొదలు, చెట్లుతో నిండిపోయి ఉండటంతో హైవేలో రాకపోకలు సాగించే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధితశాఖ అధికారులుస్పందించి కూడలిలో ఇరువైపులా ఉన్న ముళ్లపొదలుచెట్లు తొలగించి ప్రమాదాలు కాకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుడి దాడి

పరిగి,జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేతులపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రాధాకృష్ణ కుటుంబంపై వైసీపీ నాయకుడు రామాంజినప్ప దాడి చేశారు. రామాంజినప్ప, రాధాకృష్ణ అన్నదమ్ములు. రామాంజినప్ప వైసీపీలో ఉండగా రాధాకృష్ణ టీడీపీ కార్యకర్తగా ఉన్నారు. అయితే ఆస్తి విషయంలో వీరి మధ్య ఆదివారం రాత్రి వాగ్వాదం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా రామాంజినప్ప కుటుంబ సభ్యులు రాధాకృష్ణ, అతడి భార్య సరస్వతమ్మ, కుమారుడు జయప్రకాష్‌పై దాడిచేశారు. దీంతో వారు గాయపడ్డారు. వెంటనే వారిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రంగడుయాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చికిత్స పొందుతున్న రాధాకృష్ణ

భోజనం నాణ్యతతో ఉండాలి: ఎంఈఓ



భోజనం తయారీని పరిశీలిస్తున్న ఎంఈఓ

రొళ్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వడ్డించే భోజనం నాణ్యతతో ఉండాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అలుపనల్లి పాఠశాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనంలో ఉపయోగించే ఆకుకూరలు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. రుచికరమైన అన్నం విద్యార్థులకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు.

ప్రహరీ ఏర్పాటు చేయండి

అగళి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీహాస్టల్‌కు ప్రహరీ ఏర్పాటు చేయాలని అగళి ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. హాస్టల్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రహరీ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ చుట్టుపక్క ప్రాంతాల్లో కంపచెట్లు నిండి ఉండటంతో విషపురుగుల సంచారం అధికంగా ఉంటుంది. విద్యార్థులు బయటకు రావడానికి కూడా జంకుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు స్వయంగా హాస్టల్‌కు వచ్చి విద్యార్థులతో చర్చించి కాంపౌండ్‌వాల్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్‌కు కావాల్సిన మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయని, హాస్టల్‌లో 200మందిదాకా విద్యార్థులు ఉంటున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టల్‌కు ప్రహరీ నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



బీసీ బాలుర వసతి గృహం

బాధితుడికి ఎంపీ బీకే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ

పరిగి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న వన్నంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కేశవరెడ్డిని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. ఎంపీ బీకే వెంట ధనాపురం మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి: సీఐటీయూ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

పెనుకొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని సోమవారం నిరసనకు దిగారు. సీఐటీయూ కన్వీనర్ బాబావలి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతులు ఇవ్వడం జరిగిందన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, జీఓ-36అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహబూబ్‌బాషా, వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్, నరసింహ, జబ్బార్, చలపతి, వెంకటేశ్ పాల్గొన్నారు.

13న ఎస్ఎస్‌కే సంఘం ఎన్నికలు

పావగడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్‌కె శనిమహాత్మ కార్యనిర్వాహక సంఘం ఎన్నికలు జూలై 13న నిర్వహించనునట్లు సంఘం అధ్యక్షుడు ఆనంద్‌రావు తెలిపారు. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ జరుగుతోందని, 2న బుధవారం నామినేషన్ల ఆఖరి తేదీగా ప్రకటించడం జరిగిందన్నారు. 3న నామినేషన్లు పరిశీలన, 6న ఉపసంహరణకు అవకాశం ఉంటుందని వివరించారు. 7న అభ్యర్థుల జాబితాను ప్రకటించి 13న మధ్యాహ్నం 2.30 నుంచి 6 గంటల వరకు ఎస్ఎస్‌కే డైనింగ్‌హాల్‌లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం 7గంటల నుంచిఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

పావగడ, జూన్30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగంపై అవగాహన ర్యాలీని ఉద్యోగులు సోమవారం నిర్వహించారు. అవసరం మేరకు విద్యుత్‌ను వినియోగించాలని సూచించారు. విద్యుత్ తీగల వద్ద వస్త్రాలను ఆరివేయడం, విద్యుత్ స్తంభాల వద్ద నిలుచోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఈ కృష్ణమూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐముక్తేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పెనుకొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన ఐముక్తేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అర్చకులు కన్నాస్వామి, మూర్తిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ప్రత్యేక పూలతో అలంకరించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

రొద్దం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ద్విచక్రవాహన మెకానిక్ జిలాన్‌బాష బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. తెలుసుకున్న ఫ్రెండ్స్ అండ్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.19,500 అందజేశారు. సోమవారం జిలాన్‌బాష స్వగృహంలో అశ్వర్థనారాయణ, ఆనంద్ రాజు, రంగనాథ్‌రాజు, హరీష్‌రావు, శివయ్య తదితరులు ఆర్థిక సాయం అందజేశారు.

ఆటోను ఢీకొన్న ద్విచక్రవాహనం

- ముగ్గురికి గాయాలు

గోరంట్ల, జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిందూపురం ప్రధాన రహదారిపై పాలసముద్రం వద్ద ఆటోను ద్విచక్రవాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో ముద్దలకుంటపల్లికి చెందిన ప్రసన్నకుమార్, రాగిమేకలపల్లికి చెందిన హరినాయక్, సోమవారం వస్తుండగా, తమ్మినాయనపల్లికి చెందిన బాబాఫకృద్దీన్ ద్విచక్రవాహనంపై ఎదురుగా ఆటోను ఢీకొన్నాడు. దీంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో బాబాఫకృద్దీన్, ప్రసన్నకుమార్, హరినాయక్ గాయపడ్డారు. 108లో హిందూపురం ఆసుపత్రికి వీరిని తరలించారు.

పోలీసుల అదుపులో మాజీ ఎంపీపీ

పెనుకొండ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మునిమడుగు-కొత్తచెరువు దారిలో ఇటీవల ఆంజనేయులు అలియాస్ (బేనిష్)పై దాడిచేసిన సంఘటనలో మాజీ ఎంపీపీ చిన్నవెంకటరాముడు, మరో ఇద్దరిపై కేసు నమోదైంది. సోమవారం తెల్లవారుజామున కొత్తచెరువు సీఐ, సిబ్బందితో మునిమడుగు గ్రామానికి చేరుకుని మాజీ ఎంపీపీ వెంకటరాముడును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

పుస్తకాల పంపిణీ

గుడిబండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని 169 అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలను పంపిణీ చేసినట్లు సీడీపీఓ గంగరత్నమ్మ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించి చిన్నారుల విద్యాభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమలమ్మ, యూనియన్ సభ్యులు మహదేవమ్మ, సుజాతదేవి, రమ్య, లక్ష్మీదేవి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.